

సాంకేతిక పరిజ్ఞానం..
సైబర్ నేరాలను నిరోధించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలని సీపీ పోతరాజు సాయిచైతన్య అన్నారు.
- 8లో ▸



మహిళల భాగస్వామ్యంతోనే..
గ్రామ పంచాయతీ కార్యక్రమాల్లో మహిళలు భాగస్వాములైతేనే అభివృద్ధి సాధ్యమని కేంద్ర ప్రభుత్వ బృందం సభ్యులన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
29.5 /22.7
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యాయా?



కమ్మర్‌పల్లి: మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యాయా? సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపడుతున్నారా? అని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండల కేంద్రాల్లో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమ్మర్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఇన్ పేషెంట్ వార్డు, లాబొరేటరీ, ఫార్మసీ గదులను తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్, గర్భిణుల వివరాల నమోదు, ఆరోగ్య పరీక్షలు, సబ్ సెంటర్ల పరిధిలో అందిస్తున్న వైద్య సేవలు తదితర అంశాలపై సమీక్షించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి గర్భిణీకి సంబంధించి రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌లోని సహకార గిడ్డంగులను తనిఖీ చేశారు. కమ్మర్‌పల్లి గోదాములో స్టాక్ బోర్డుపై వివరాలు ప్రదర్శించకపోవడాన్ని గమనించిన ఆయన.. సీఈవో శంకర్‌ను నిలదీశారు. అప్పటికప్పుడు స్టాక్ వివరాలు రాయించారు. సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

రైతులను సేంద్రియ సాగువైపు మళ్లించాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించాలని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్ కృషి సఖీలకు సూచించారు. నేచురల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో వివిధ మండలాలకు చెందిన కృషి సఖీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సేంద్రియ సాగు చేస్తే పోషకాలతో పంటలు పండుతాయని, నేలకు కూడా మంచి జరుగుతుందని తెలిపారు. సేంద్రియ పద్ధతులు దానివలన భావి తరాలకు చేకూరే ప్రయోజనాలను కృషి సఖిలు రైతులకు తెలియజేయాలన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, శ్వేత, కృష్ణ, పద్మ పాల్గొన్నారు.

తాత్కాలికంగా రైల్వేగేట్ల మూసివేత

- జానకంపేట- బోధన్ స్టేషన్ల మధ్య ..

బోధన్: ఎడపల్లి మండలంలోని జానకంపేట నుంచి బోధన్ రైల్వే స్టేషన్ వరకు మార్గమధ్యలో రైల్వే లైన్‌కు అనుసంధానంగా ఉన్న రైల్వేగేట్లను బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి 11 గంటల వరకు మూసివేస్తున్నట్లు నిజామాబాద్ రైల్వే శాఖ అధికారులు బుధవారం తెలిపారు. ఎడపల్లి మండలంలోని దూపల్లి, జైతాపూర్(ఎంఎస్సీఫారం), సాటాపూర్, జంలం గ్రామాలకు వెళ్లే దారిలోని రైల్వేగేట్లను మూసివేశారు. ప్రయాణికులు అసౌకర్యానికి గురికాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని, మరమ్మతు పనులకు సహకరించాలని కోరారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు అందించినట్లు పేర్కొన్నారు.

రాత్రికి రాత్రే అడ్రస్ మారింది!


- మాదాపూర్ నుంచి దాస్‌నగర్‌కు తరలిన మాక్లూర్ పీఎస్



దాస్‌నగర్ వద్ద నూతన పోలీస్‌స్టేషన్

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ శివారులో కొనసాగిన మాక్లూర్ పోలీస్‌స్టేషన్ దాస్‌నగర్ వద్ద నిర్మించిన నూతన భవనంలోకి రాత్రికి రాత్రే మారింది. దాస్‌నగర్ వద్ద నూతన భవనం నిర్మించినప్పటికీ పోలీస్ స్టేషన్ అక్కడికి ఎప్పుడు తరలిస్తారనేదానిపై స్పష్టత లేదు. మంగళవారం రాత్రి వరకు మాదాపూర్‌లో కొనసాగిన స్టేషన్ కార్యకలాపాలు బుధవారం ఉదయం దాస్‌నగర్‌లో ప్రారంభమయ్యాయి. మాదాపూర్‌కు వచ్చిన పలువురు ఇక్కడి నుంచి స్టేషన్ తరలిపోయిందని తెలుసుకుని అవాక్కయ్యారు. స్టేషన్ తరలిస్తున్నట్లు లేదా తరలినట్లు కనీసం ఎక్కడా బోర్డు ఏర్పాటు చేయలేదని విస్మయం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. 24 గంటల పాటు తెరిచి ఉండాల్సిన పీహెచ్‌సీలలో వైద్యులు ఉండటం లేదు. సీహెచ్‌సీలలో వైద్యులు ఉన్నా రాత్రుల్లో విధులకు దుమ్మా కొడుతున్నారు. కొన్ని పీహెచ్‌సీలను ఉదయం సాయంత్రం వరకు తెరిచి ఉంచినా సేవలు మాత్రం అందడం లేదు. దీంతో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో రోగులు ప్రయివేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.



అందని వైద్యం.. రోగుల దైన్యం

- పీహెచ్‌సీలలో వైద్యుల కొరత
- సీహెచ్‌సీలలో వైద్యులు ఉన్నా నైట్ డ్యూటీకి వెనకడుగు
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ప్రయివేట్ ఆస్పత్రులకు రోగుల పరుగులు

నిజామాబాద్ నాగారం: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు 27, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఐదు, అర్బన్ హెల్త్ సెంటర్లు పది, బస్తీ దవాఖానాలు మూడు ఉన్నాయి. వీటిలో ప్రతినిత్యం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించాలి. అయితే వైద్యుల కొరత ఒకవైపు, కొందరు వైద్యులు పనిచేసే చోట నివాసం ఉండకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. మరో వైపు సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు రోగాల బారిన పడుతున్నారు. వైరల్ ఫీవర్‌తో పాటు డెంగీ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా పేద రోగులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

24 గంటల వైద్య సేవలు వట్టి మాటే..

జిల్లాలో జీజీహెచ్, బోధన్ జిల్లా ఆస్పత్రి, ఆర్మూర్ ఏరియా ఆస్పత్రుల్లోనే 24 గంటల వైద్య సేవలు రోగులకు అందుతున్నాయి. మిగతా వైద్యారోగ్యశాఖ పరిధిలోని తొమ్మిది ఆస్పత్రుల్లో, పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందడం లేదు. వీటిలో నందిపేట, దేగాం, సిరికొండ, భీమ్‌గల్, మెండోరా, చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి, సాలూర, రెంజల్ తదితర ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో ముగ్గురు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరిద్దరితో నడిపిస్తున్నారు. కొన్ని పీహెచ్‌సీల్లో రాత్రుల్లో స్టాఫ్ నర్సులతో ఎమర్జెన్సీ సేవలు అందిస్తున్నారు. ఇక తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో వర్ని, నవీపేట, డిచ్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ సీహెచ్‌సీలున్నాయి. ప్రతి సీహెచ్‌సీ పరిధిలో నలుగురైదుగురు వైద్యులు, సరిపడా స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు. అయినా రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందడం లేదు. ఏ ఒక్క వైద్యుడు కూడా రాత్రుల్లో విధులు నిర్వహించడం లేదని అధికారులే చెబుతున్నారు. ఇలాగైతే రోగులకు వైద్య సేవలు ఎలా అందుతాయని పలువురు విమర్శిస్తున్నారు.

పనిచేసే చోట లేకున్నా..

నిబంధనల ప్రకారం వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది పనిచేసే చోటే నివాసం ఉంటూ హెచ్‌ఆర్‌ఏ తీసుకోవాలి. స్థానికంగా ఉండకున్నా వైద్య సిబ్బంది హెచ్‌ఆర్‌ఏ మాత్రం తీసుకుంటున్నారు. వైద్య సేవలు అంతంతే అందిస్తున్నారు.

వైద్యులు అవసరం..

సీహెచ్‌సీలలో సరిపడా వైద్యులు ఉన్నారు. అయినా 24 గంటల పాటు విధులు నిర్వహించడానికి వెనకడుగు వేస్తున్నారు. క్యాడర్ ప్రకారం మరికొంత మంది వైద్యులు అవసరం ఉందని చెబుతున్నారు. పీహెచ్‌సీలలో సరిపడా వైద్యులు లేరని అందుకే 24 గంటలు వైద్య సేవలు అందించడం లేదని చెబుతున్నారు. దీంతో పల్లె ప్రజలు రోగాల బారిన పడితే పగలు, రాత్రి తేడా లేకుండా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రులు, ఆర్మూర్, బోధన్ ఆస్పత్రులు, ఇతర మండల కేంద్రాల్లో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. ఇటీవల మోపాల్ మండలం కాల్పోల్ గ్రామంలో జ్వరపీడితులు ప్రభుత్వ వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లిన విషయం తెలిసిందే.

పీహెచ్‌సీలలో సరిపడా సిబ్బంది లేకున్నా..

పీహెచ్‌సీలలో సరిపడా వైద్యులు లేరు.అందుకే 24 గంటల సేవలు అందించడానికి వీలు కావడం లేదు. రాత్రుల్లో స్టాఫ్ నర్సులతో ఎమర్జెన్సీ సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధులు ఉన్నందున వైద్యులు పనిచేసే చోట ఉండాలని ఆదేశాలు జారీ చేస్తాం. ప్రజలకు మెరుగైనా వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నాం.
– డాక్టర్ రాజశ్రీ, డీఎంహెచ్‌వో

సీహెచ్‌సీల్లో వైద్యులు రాత్రి డ్యూటీ చేయడం లేదు

మా పరిధిలో ఉన్న సీహెచ్‌సీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఉంటున్నారు. ప్రతి సీహెచ్‌సీలో నలుగురు, ఐదుగురు వైద్యులు ఉన్నారు. ఇంకా క్యాడర్ ప్రకారం వైద్యుల అవసరం ఉంది. ప్రస్తుతానికి రాత్రుల్లో ఏ వైద్యుడు అందుబాటులో ఉండడం లేదు. నిజామాబాద్ నుంచి వైద్యులు ఆస్పత్రులకు వెళ్లి వస్తున్నారు. పనిచేసే చోట ఎవరూ ఉండటం లేదు. – డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్, తెలంగాణ వైద్యవిధాన పరిషత్

కేసుల నమోదు ఇలా..

- జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జూన్‌లో 362 జ్వరాల కేసులు నమోదు కాగా ఇందులు 31 డెంగీ కేసులు ఉన్నాయి.
- జూలైలో 555 జ్వరాల కేసులు ఉండగా ఇందులో 51 డెంగీ కేసులు ఉన్నాయి.
- ప్రభుత్వ ఆస్పత్రుల కంటే ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా జూన్ నెలలో 800 పైనే జ్వరాల కేసులు నమోదయ్యాయి. జూలైలో ఇప్పటి వరకు 1000 మంది వైరల్ ఫీవర్స్‌తో వైద్య సేవలు పొందుతున్నారు. చిన్న పిల్లలు ప్రతినెలా 2 వేల మంది వరకు పిల్లల వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు. ఇందులో డెంగీ కేసుల లెక్క లేనే లేదు.

దవాఖానాలో కాదన్నారు.. 108 సిబ్బంది చేశారు

- బోధన్ జిల్లా ఆస్పత్రి నుంచి జీజీహెచ్‌కు తరలిస్తుండగా..
- 108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం
- సాధారణ కాన్పు చేసిన సిబ్బంది

బోధన్: బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన గర్భిణి బర్మె లక్ష్మీబాయికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి బుధవారం తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్య సిబ్బంది పరిస్థితి క్రిటికల్‌గా ఉందని నిజామాబాద్‌లోని జీజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. లక్ష్మీబాయిని 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో సిబ్బంది అంబులెన్స్‌ను సారంగాపూర్ వద్ద నిలిపివేశారు. ఈఆర్‌సీపీ వైద్యుడు మనీశ్ సలహా మేరకు కాన్పు చేయగా లక్ష్మీబాయి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. క్షేమంగా ఉన్న తల్లీబిడ్డలను నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీబాయికి సాధారణ కాన్పు చేసిన 108 అంబులెన్స్ ఈఎంటీ లక్ష్మణ్, పైలట్ జావీద్‌ను వైద్యులు, లక్ష్మీబాయి కుటుంబ సభ్యులు అభినందించారు. బోధన్‌లోని జిల్లా ఆస్పత్రిలో సాధ్యం కాదని చెప్పగా.. 108 అంబులెన్స్‌లో సాధారణ కాన్పు కావడం గమనార్హం.



లక్ష్మీబాయి కుటుంబ సభ్యులకు పసికందును అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

కలెక్టర్ వచ్చి టీసీ ఇప్పించే..

- ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు టీసీలు ఇచ్చేందుకు నిరాకరణ
- ప్రైవేట్ కళాశాలకు వెళ్లి ఆరా తీసిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీభాషిత జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసిన 15 మంది విద్యార్థులు ఫీజుల భారాన్ని భరించలేక ప్రభుత్వ కళాశాలకు వెళ్లాలనుకున్నారు. టీసీల కోసం దరఖాస్తు చేసుకోగా.. ప్రైవేట్ కళాశాల యాజమాన్యం నిరాకరించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి బుధవారంతో గడువు ముగుస్తుందని ఆందోళనకు గురయ్యారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మండల కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేస్తూ వెళ్తుండడాన్ని గమనించిన ఆ విద్యార్థులు వాహనాన్ని ఆపి తమ గోడును వెళ్లబోసుకున్నారు. విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ వెంటనే ప్రైవేట్ కళాశాలకు వెళ్లారు. టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను పక్షం రోజులుగా ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నచ్చిన కాలేజీలో చదివే స్వేచ్ఛ విద్యార్థులకు ఉందని, సెకండియర్ కూడా మీ కాలేజీలోనే చదవాలని బలవంతం చేయడం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు ఇప్పటికిప్పుడు టీసీలు ఇవ్వాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ ప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మధుకుమార్‌ను అక్కడికి పిలిపించుకుని విద్యార్థులకు వెంటనే టీసీలు ఇప్పించి, ప్రభుత్వ కాలేజీలో ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాల ని ఆదేశించి వెళ్లారు. తహసీల్దార్ అక్కడే ఉండి విద్యార్థులకు టీసీలు ఇప్పించి ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ఇప్పించడంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు.



ప్రైవేట్ కళాశాల ఇన్‌చార్జితో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

త్వరలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఎత్తివేత

- ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం
- సాలూరాలో ఇక తనిఖీలు చేసేది ఎక్సైజ్‌శాఖ మాత్రమే..

బోధన్: జిల్లా సరిహద్దులోని ఏకైక రవాణా చెక్‌పోస్టు(సాలూర) ఇక మూతపడనుంది. జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చెక్‌పోస్టులను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను రద్దు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం సోమవారం నాటి సమావేశంలో తీర్మానించిన విషయం తెలిసిందే. చెక్‌పోస్టు ఎత్తివేతకు సంబంధించి ప్రభుత్వం నుంచి త్వరలో ఆదేశాలు వచ్చే అవకాశాలున్నాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. సాలూర చెక్ పోస్టులో ఒక ఎంవీఐ, ఆరుగురు ఏఎంవీఐలు, ఐదుగురు కానిస్టేబుళ్లు, కంప్యూటర్ ఆపరేటర్ పని చేస్తున్నారు. కేంద్ర రవాణ మంత్రిత్వ శాఖ అమలులోకి తెచ్చిన వాహన్ పోర్టల్ ద్వారా ఇప్పటికే రవాణ శాఖకు సంబంధించిన సేవలను అందిస్తున్నారు. ఇక నుంచి వాహన్ పోర్టల్, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగనుంది.

దశాబ్దాల క్రితం ఏర్పాటు

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని సాలూర ప్రాంతంలో నాలుగున్నర దశాబ్దాల క్రితం అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రారంభంలో గ్రామ బస్టాండ్ కూడలిలో వీడీసీకి చెందిన రేకుల షెడ్డులో ఏర్పాటు చేసి కొన్నేళ్లపాటు అక్కడే కొనసాగించారు. ఆ తర్వాత మంజీర నది ఒడ్డుకు మార్చారు. మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకుని ప్రభుత్వం సుమారు 10 ఎకరాల భూమి కొనుగోలు చేసి అధునాతన భవనాన్ని నిర్మించింది. భవనంలో అంతర్రాష్ట్ర ఉమ్మడి తనిఖీ ప్రాంగణం పేరుతో రవాణ, వాణిజ్యపన్నుల శాఖ, సివిల్ సప్లయీస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

జీఎస్టీ విధానం అమలులోకి వచ్చిన తరువాత వాణిజ్య పన్నుల శాఖను ఎత్తివేశారు. ఆ తరువాత వ్యవసాయ మార్కెట్ కమిటీ, సివిల్ సప్లయీస్ చెక్ పోస్టులు తొలగించారు. ప్రస్తుతం రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టులు మాత్రమే ఉండగా, ఇక నుంచి ఎక్సైజ్ చెక్ పోస్టు ఒక్కటీ మిగలనుంది.



సాలూర శివారులో చెక్ పోస్టు

ఇక్కడి నుంచి రూ.కోట్ల ఆదాయం

ఆర్టీవో చెక్‌పోస్టు ద్వారా నాలుగేళ్ల క్రితం వరకు ఏటా రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వాన్నికి ఆదాయం సమకూరేది. వాహన పర్మిట్లు, ఓవర్ లోడ్ అపరాధ రుసుము, ఇతర పన్నుల రూపంలో చెక్‌పోస్టు ద్వారా ఖజానాకు ఆదాయం జమయ్యేది. ప్రస్తుతం ఆదాయం సగానికి తగ్గిపోయింది. ఏసీబీ దాడులతో అనేకసార్లు ఈ చెక్‌పోస్టు వార్తల్లో నిలిచింది.

వాడి చూడండి.. తర్వాతే నమ్మండి!

- నానో యూరియాపై రైతులకు విస్తృత అవగాహన
- పంటలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న వ్యవసాయ శాఖ

డొంకేశ్వర్(ఆర్మూర్): బస్తాల్లో వచ్చే యూరియా వినియోగాన్ని క్రమంగా తగ్గించాలని, దానికి ప్రత్యామ్నాయంగా వచ్చిన ద్రవ రూపంలోని నానో యూరియాను వాడాలని వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. మండల, గ్రామ స్థాయిలో వ్యవసాయాధికారులు రైతులను కలిసి నానో యూరియా వల్ల కలిగే లాభాలను వివరిస్తూ అపోహలను పోగొడుతున్నారు. వాడి చూసిన తరువాత నమ్మాలని సూచిస్తున్నారు. లాభాలతోపాటు ఖర్చు తక్కువ కావడంతో జిల్లాలో కొంతమంది రైతులు నానో యూరియాను వినియోగిస్తున్నారు. నమ్మకం ఏర్పడిన తర్వాత బస్తాల యూరియా జోలికి వెళ్లడం లేదు. దీంతో జిల్లాలో నానో యూరియా విక్రయాలు పెరిగినట్లు వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇటీవల దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం యూరియా వినియోగాన్ని తగ్గించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అలాగే రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.



డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్‌లో నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో మధుసూదన్

బస్తాల యూరియా

- ఇది గుళికల రూపంలో ఉంటుంది. ఒక బస్తా 45 కిలోలు ఉంటుంది. ఖరీదు రూ.267.
- వరికైతే ఎకరానికి 3 నుంచి 4 బస్తాలు, మొక్కజొన్నకు 4 నుంచి 6 బస్తాలు అవసరమవుతాయి.
- బస్తాల రవాణాకు ఇబ్బందులు. తెచ్చిన వాటిని నిల్వ చేసుకోవడం, మళ్లీ పొలానికి తీసుకెళ్లడం కష్టం. ఖర్చుతో కూడుకున్న పని.
- గుళికల యూరియా ప్రభావం రెండు, మూడు రోజులే ఉంటుంది. పొలానికి వాడిన మొత్తం యూరియాలో 30 శాతమే మొక్కకు అందుతుంది.
- చల్లిన తర్వాత నీటిలో కరిగిపోయి నేల, గాలిలో కలిసిపోయి వాతావరణ, భూకాలుష్యం జరుగుతుంది. పంట దిగుబడి తగ్గే అవకాశం.
- పొలాల్లో చల్లేందుకు కూలీలు అవసరం, ఖర్చుతో కూడుకున్న పని.

గతేడాది నుంచి వాడుతున్నాం



రైతులకు నానో యూరియా మీద నమ్మకం పెంచాలనే ఉద్దేశంతో ముందుగా నేనే నానో యూరియాను పంటలకు వినియోగించాను. గతేడాది ఐదెకరాల పసుపు పంటకు, ఈ ఏడాది 4ఎకరాల మొక్కజొన్నకు నానో యూరియా స్ప్రే చేయించా. ఇప్పుడు వరికి కూడా వేయిస్తా. ఒక ఎకరానికి 250ఎంఎల్ నానో యూరియాకు సాగరిక అనే లిక్విడ్ కలిపి పంటలకు స్ప్రే చేసినా బాగుంటుంది. తక్కువ ఖర్చుతో పర్యావరణానికి హాని కలగకుండా మంచి పంట దిగుబడి వస్తుంది.
– బార్ల భరత్‌రాజ్ రెడ్డి, సొసైటీ చైర్మన్, డొంకేశ్వర్

భూములు నిస్సారమవుతాయి



బస్తాల్లో దొరికే యూరియాకే రైతులు అలవాటు పడి మోతాదుకు మించి వేస్తున్నారు. ఈ కారణంగా భూములు నిస్సారం అవుతాయి. పంట ఉత్పాదక శక్తి కూడా కోల్పోతుంది. నేలలో చల్లడం కారణంగా నీరు, గాలి, భూమి కలుషితం అవుతుంది. రైతులు వేసే మొత్తం యూరియాలో కేవలం 30 శాతమే మొక్కలకు అందుతుంది. ఐదేళ్ల నుంచి నానో యూరియా వాడాలని రైతులకు చెబుతున్నాం. ఇప్పుడిప్పుడే రైతుల్లో మార్పు కనిపిస్తోంది.
– మేకల గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి

నానో యూరియా

- ఇది ద్రవరూపంలో ఉంటుంది. ఒక బాటిల్ అర లీటరు ఉంటుంది. ధర రూ.225 మాత్రమే.
- ఎకరానికి అరలీటరు బాటిల్ సరిపోతుంది. రెండు సార్లు స్ప్రే చేస్తే చాలు.
- రవాణా చాలా సులభం. బరువు లేకుండా జేబులో లేదా కవర్లు, బ్యాగుల్లో తీసుకెళ్లవచ్చు. ఖర్చు పెద్దగా ఉండదు.
- ద్రవరూపంలోని యూరియా ఎనిమిది రోజులపాటు మొక్కలపై ప్రభావం చూపుతుంది. వాడిన మొత్తం యూరియా వినియోగం అవుతుంది.
- ఇది మొక్క ఆకులపైనే పిచికారి చేయడం వల్ల ఎలాంటి కాలుష్యం కాదు. తక్కువ యూరియా వాడటంతో భూసారం తగ్గదు. పంట దిగుబడి బాగుంటుంది.
- స్ప్రే యంత్రంలో పోసి సులభంగా పిచికారీ చేయొచ్చు. ఖర్చు ఉండదు.

క్లుప్తంగా

ఆయిల్ పామ్ నర్సరీని సందర్శించిన కలెక్టర్



ఆయిల్ పామ్ నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ నర్సరీని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా తోడ్పాటును అందజేస్తామన్నారు. నర్సరీలో లక్షన్నర ఎకరాలకు సరిపడా మొక్కలను అందుబాటులో ఉంచడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ రావు, ఏడీఏ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా శ్రీదేవి



జడ్జి శ్రీదేవిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర హైకోర్టు జ్యుడీషియల్ అసోసియేషన్ ఎన్నికలలో సంయుక్త కార్యదర్శిగా ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి గెలుపొందారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి సరళరాణి, ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జడ్జి శ్రీదేవిను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్, ఉపాధ్యక్షుడు గటడి ఆనంద్, కోశాధికారి గజ్జల చైతన్య, కార్యదర్శి శ్రావణ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మధ్యాహ్న భోజనానికి సంబంధించి 2025- 26 సంవత్సర రెగ్యులర్ బిల్లులు కోసం నిధులు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు కుకింగ్ నిధులు రూ.2 కోట్ల 15 లక్షల 328, సీసీహెచ్‌ల గౌరవ వేతనం రూ.48 లక్షలు ఆయా మండలాల వారీగా రిలీజ్ చేశామన్నారు.

విద్యార్థులతో పాఠశాల పనులు



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లు చేయాల్సిన పనులను విద్యార్థులతో చేయిస్తున్నారు. జిల్లాలోని ఎడపల్లి మండలం మంగల్‌పాడ్ పాఠశాలలో ఇద్దరు స్కావెంజర్లు ఉన్నా అక్కడి ఉపాధ్యాయులు విద్యార్థులతో పనులు చేయిస్తున్నారు. పాఠశాల ఆవరణ ఊడ్చడం, బెంచీలు, కుర్చీలను మోయించడం తదితర పనులు చేయిస్తున్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులు వివిధ పనులు చేస్తూ కనిపించారు. స్కావెంజర్లు ఇలా వచ్చి అలా వెళ్తున్నారని, హెచ్‌ఎం కూడా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. చదువుకోవాల్సిన పిల్లలతో పనులు చేయించడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మైనారిటీ డిక్లరేషన్ అమలేదీ?

- డిక్లరేషన్ వదిలేసి ఇమామ్‌లు, మౌజమ్‌ల గౌరవ వేతనాల విషయంలో కొర్రీలు
- దరఖాస్తులకు పరిమిత గడువుతో సమస్యలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మైనారిటీల అభ్యున్నతి కోసం రూ.4 వేల కోట్లు కేటాయించి, ప్రత్యేకంగా ఉప ప్రణాళిక అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ దాన్ని మరచిందని మైనారిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాదిన్నర దాటినప్పటికీ దీని ఊసేలేదని, గత ఎన్నికల్లో పేరుకే మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించారని అంటున్నారు. ఇదిలా ఉండగా కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ వేతనం చెల్లించే విషయంలోనూ ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విధించిన నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లు, మౌజమ్‌లకు గత ప్రభుత్వం నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తూ వచ్చింది. ఇలా పనిచేసే వారిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు సైతం ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,200 మంది ఇమామ్‌లు, మౌజమ్‌లు ఉన్నారు. ఈ ఏడాది ఈ గౌరవ వేతనాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఓ స్థానిక ఉర్దూ పత్రికలో ప్రకటన ఇచ్చింది. మసీదు ధ్రువీకరణ పత్రంతోపాటు గతంలో లేనివిధంగా పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం సైతం జత చేయాలని నిబంధనలు పెట్టింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఇన్‌కం సర్టిఫికెట్లు తెచ్చుకోలేకపోతున్నారు. అలాగే గడువు సైతం జూలై 31 వరకే ఇవ్వడంతో అత్యధిక మంది ఇమామ్‌లు, మౌజమ్‌లు దరఖాస్తులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో గడువు పొడిగించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇమామ్‌లకు, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.12 వేలకు పెంచుతామని ప్రకటించింది. అయితే ఇచ్చిన హామీ మేరకు పెంచకపోగా ఇలా కఠిన నిబంధనలు పెట్టడమేమిటని పలువురు అంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఇలాంటి నిబంధనలు లేవని, పైగా ప్రస్తుతం నెలనెలా చెల్లింపులు చేయకుండా మూడునెలలకోసారి చెల్లిస్తున్నారని చెబుతున్నారు.


MINORITY DECLARATION

Financial Upliftment and Empowerment

Commitment to Education and Employment Equity

Protection of Religious Rights and Culture

Infrastructure and Welfare

Promotion of Inclusivity and Growth

కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్

కోత పెట్టేందుకే కఠిన నిబంధనలు..



ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇస్తున్న గౌరవ వేతనాల్లో కోత పెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతోంది. ఎన్నికల హామీ మేరకు గౌరవ వేతనాలు పెంచకపోగా కావాలనే కఠిన నిబంధనలు రూపొందించారు. ప్రభుత్వం గడువును మరో నెలరోజులు పొడిగించాలి. మూడు నెలలకొకసారి ఇస్తున్న గౌరవ వేతనాలను గత ప్రభుత్వం ఇచ్చినట్లుగా నెలనెలా ఇవ్వాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలనే నిబంధన సరికాదు.

– యాకూబ్‌పాషా, రాష్ట్ర అధ్యక్షుడు, మైనారిటీ సంక్షేమ సంఘం

ప్రతిపాదనలు పంపాం..

నిబంధనల్లో మార్పులు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. దరఖాస్తుల గడువు పెంచే విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం.

– అసదుల్లా, సీఈవో, రాష్ట్ర వక్ఫ్ బోర్డు

మహిళల భాగస్వామ్యంతోనే గ్రామీణాభివృద్ధి

- కేంద్ర ప్రభుత్వ బృందం సభ్యులు సుధాకర్ రెడ్డి, లోహిత్



అమీర్‌నగర్‌లో ప్రజల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కమ్మర్‌పల్లి: గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో మహిళలు భాగస్వామ్యం అయినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్ర ప్రభుత్వ పథకాల పర్యవేక్షక బృందం సభ్యులు సుధాకర్ రెడ్డి, లోహిత్ పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని అమీర్‌నగర్, డీసీ తండా గ్రామాల్లో వారు బుధవారం పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన పథకాల అమలు తీరు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలతోపాటు ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. స్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలు ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వామ్యం కావాలని సూచించారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల కల్పన మిషన్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీ ఇవ్వడంతోపాటు రుణ పరిమితిని సైతం పెంచినట్లు ఐకేపీ అధికారులు తెలిపారు.

వినతుల వెల్లువ..

ఉపాధి పని దినాలను పెంచాలని, మహిళా సంఘాలకు వడ్డీ తగ్గించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కేంద్ర బృందం సభ్యులకు స్థానికులు విన్నవించారు. అందుకు స్పందించిన సభ్యులు కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. డీసీ తండాలో జీపీ భవనానికి సంబంధించి బిల్లు రాలేదని మాజీ సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అభివృద్ధి పనులకు అధిక నిధులు



పనుల నమూనాను పరిశీలిస్తున్న పోచారం

వర్ని (మోస్రా): ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మోస్రా మండల కేంద్రంలో నిర్మిస్తున్న మండల సముదాయ భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. వచ్చే నెల 4న మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లో మండల సముదాయ భవనాలు, జనరల్ ఫంక్షన్ హాల్, గ్రామ పంచాయతీ భవనాలను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించనున్నట్లు తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలి

- సీపీ సాయిచైతన్య



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని, వాటిని నిరోధించేందుకు ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలని సీపీ పోతరాజు సాయిచైతన్య పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ హాల్‌లో బుధవారం సైబర్ వారియర్స్‌కి సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఫిషింగ్, వేరియంట్ ఫ్రాడ్స్, సోషల్ మీడియా మోసాలుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి కేసును సీరియస్‌గా తీసుకొని బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో 1 జనవరి 2024 నుంచి జూలై 29, 2025 వరకు మొత్తం 759 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా రూ.3,27,12,397.84 కోర్టు ద్వారా బాధితులకు అందించామన్నారు. అనంతరం సైబర్ వారియర్స్‌కు టీ షర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ వై వెంకటేశ్వరరావు, సీఐ మహమ్మద్ ముఖీద్ పాషా, ఎస్సై ఎం ప్రవళిక , సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో బయోమెట్రిక్ అటెండెన్స్

- డీఐఈవో రవికుమార్



మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ పేర్కొన్నారు. డీఐఈవో కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమలుకు విద్యార్థుల బయోడేటా, ఆధార్‌ను ఇంటర్ బోర్డు లాగిన్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. అపార్ నెంబర్ గుర్తింపుతోపాటు యుడైస్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు సమయపాలన పాటించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంటర్ బోర్డు సూచించిన సెంట్రలైజ్డ్ టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాలని తెలిపారు. అడ్మిషన్ల సంఖ్య పెంచాలని, పేరెంట్స్ మీటింగ్‌లు నిర్వహించాలని పేర్కొన్నారు. కళాశాలల్లో మరమ్మతు పనులను పూర్తి చేయాలన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్



ప్రయాణికురాలికి బ్యాగును అప్పగిస్తున్న కండక్టర్ సువర్ణ

కామారెడ్డి క్రైం: బస్సులో మరిచిపోయిన బ్యాగును తిరిగి ప్రయాణికురాలికి అప్పగించి కామారెడ్డి డిపోకు చెందిన కండక్టర్ సువర్ణ తన నిజాయితీని చాటుకున్నారు. ఈ ఘటన బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. డిపోకు చెందిన బస్సు సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌కు వెళ్లింది. అందులో ఎక్కిన ఓ మహిళా ప్రయాణికురాలు తన బ్యాగును బస్సులో మర్చిపోయి జేబీఎస్‌లో దిగిపోయింది. బ్యాగును గమనించిన కండక్టర్ సువర్ణ తన వద్ద భద్రపరిచారు. కొద్దిసేపటి తర్వాత ప్రయాణికురాలు తన బ్యాగు కనిపించడం లేదంటూ తిరిగి బస్టాండ్‌కు వచ్చింది. అక్కడే ఉన్న కండక్టర్ ప్రయాణికురాలికి బ్యాగును అప్పగించింది. కాగా, బ్యాగులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌తోపాటు కొంత నగదు ఉంది. పోయిందనుకున్న బ్యాగు తిరిగి దొరకడంతో ప్రయాణికురాలు కండక్టర్ సువర్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడే ఉన్న కొందరు ప్రయాణికులు నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను అభినందించారు.

వారంలో రెండ్రోజులు ఫిజియోథెరపీ సేవలు

- దివ్యాంగులకు వరం.. సహిత విద్యా విభాగం
- దివ్యాంగ విద్యార్థులకు నడక నేర్పుతున్న భవిత కేంద్రాలు



ఆర్మూర్ భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో రాజగంగారాం

ఆర్మూర్: తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో శారీరక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు భవిత కేంద్రాల్లో వారానికి రెండుసార్లు ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు వారానికి ఒకసారి మాత్రమే నిర్వహించే శిబిరాలను రెండుసార్లకు పెంచడంపై పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీఈవో అశోక్, సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ శిబిరాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 29 మండలాల్లో శారీరక వైకల్యంతోపాటు సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న 426 మంది విద్యార్థులను గుర్తించారు. వీరికి ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్ల సహకారంతో ఎంపిక చేసిన ఫిజియోథెరపిస్టులు సేవలందిస్తున్నారు. ఆర్మూర్ మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళ, గురువారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

ఫిజియోథెరపిస్టుల కొరత..

జిల్లాలోని భవిత కేంద్రాలకు 15 మంది ఫిజియోథెరపిస్టులు అవసరం కాగా, ప్రస్తుతం ఎనిమిది మంది మాత్రమే సేవలందిస్తున్నారు. ఫిజియోథెరపిస్టుల కొరత ఉండటంతో కొత్త వారిని విధుల్లో చేర్చుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో శిబిరానికి వెయ్యి రూపాయల చొప్పున ఫిజియోథెరపిస్టులకు ఫీజు రూపంలో చెల్లిస్తున్నారు. వీరు ఫిజియోథెరపీ పరికరాలను ఉపయోగించి నడకను నేర్పిస్తున్నారు. పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులకు ఇంటి వద్దే చేయాల్సిన వ్యాయామాన్ని సూచిస్తారు. కాగా, తీవ్రమైన వైకల్యంతో బాధపడే పిల్లలను ప్రతిసారి శిబిరానికి తీసుకురావడం ఇబ్బందికరంగా ఉండడంతో ఇంటి వద్దనే ఫిజియోథెరపీ చికిత్సను ఉచితంగా అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం తరపున ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. పేద, మధ్య తరగతి కుటుంబీకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– అశోక్, డీఈవో, నిజామాబాద్

మందులు వాడకుండానే నయం..



సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న పిల్లలకు ఎలాంటి మందులు వాడకుండానే ఫిజియోథెరపీ ద్వారా నయం చేయవచ్చు. ఫిజియోథెరపిస్టులు సూచించే వ్యాయామాన్ని చేయించాల్సి ఉంటుంది.

– పడకంటి శ్రీనివాస్‌రావు, జిల్లా ఐఈ కోఆర్డినేటర్, నిజామాబాద్

ప్రతివారం చికిత్సతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ శిబిరంతో చక్కని ఫలితాలు పొందవచ్చును. ప్రత్యేక అవసరాల గల పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉచిత వైద్య శిబిరానికి పిల్లలను తరలించాలి.

– రాజగంగారాం, ఎంఈవో, ఆర్మూర్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు సిద్ధాంత్



కుందెన్ సిద్ధాంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

నిజామాబాద్ రూరల్: జనగామ జిల్లాలో ఆగస్టు 3,4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు మోపాల్ మండలం కంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుందెన్ సిద్ధాంత్ అండర్-12 జావెలిన్‌త్రో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌చారి , ఉపాధ్యాయ సిబ్బంది సిద్ధాంత్‌ను అభినందించారు.

నేటి సమాచారం

నేడు దోస్త్ ప్రత్యేక కేటగిరీ ధ్రువపత్రాల పరిశీలన

తెయూ (డిచ్‌పల్లి): దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు 31న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు తెయూ కోఆర్డినేటర్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ విద్యార్థులు గురువారం ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

బాలికల గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి/నిజామాబాద్ రూరల్: డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి), సుద్దపల్లి, మోపాల్ మండలం కంజర గ్రామాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు మాధవీలత, నళిని, విజయలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యాక సాయంత్రం 4 గంటలకు ఎంపికైన వారి జాబితా ప్రదర్శిస్తామన్నారు. విద్యార్థులు కుల, ఆదాయ, జనన, ఎస్సెస్సీ మెమో ఆన్‌లైన్ జిరాక్స్ 2 సెట్స్, 4 ఫొటోలు తెచ్చుకోవాలని వారు సూచించారు.

జూడో సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్-జూనియర్, క్యాడెట్ విభాగంలో 31న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని కార్యదర్శి అభినవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో ఎంపిక పోటీలు ఉదయం 10 గంటలకు ఉంటాయన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్ వెంట తీసుకొని రావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 5, 6, తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఐఎంఎల్ డిపోలో వాహనాల వేలం

ఖలీల్‌వాడి: మాక్లూర్ మండలంలోని మాదాపూర్ ఐఎంఎల్ డిపోలో నేడు వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఇంచార్జి ఎస్‌హెచ్‌వో స్వప్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ నేరంలో పట్టుబడిన రెండు వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు మాదాపూర్ ఐఎంఎల్ డిపోలో వేలం ఉంటుందని ఆసక్తి గల వారు పాల్గొనాలని పేర్కొన్నారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో డాగ్‌స్క్వాడ్స్‌తో బుధవారం తనిఖీలు నిర్వహించినట్లు ఎస్‌హెచ్ వో రఘుపతి తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వివరాలను సేకరించామన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో బ్యాగులు, మూటలు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ప్రయాణికులకు సూచించారు. తనిఖీల్లో ఏఎస్సై హబీబ్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భర్త హత్యకు సుపారీ ఇచ్చిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్లాన్
- ప్రియుడితో కలిసి కుట్ర పన్నిన భార్య
- తీవ్రగాయాలతో తప్పించుకున్న భర్త



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు , పక్కన సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై భార్గవ్‌గౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసేందుకు కుట్ర పన్నిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు కేసు వివరాలను వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలంలోని చిన్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన పల్లె సంపూర్ణకు అదే గ్రామానికి చెందిన జాన్సన్‌తో వివాహేతర సంబంధం ఉంది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్త పల్లె రవిని అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నింది. రవిని హత్య చేసిన వారికి రూ.లక్ష నగదు సుపారీగా ఇవ్వాలని జాన్సన్‌కు చెప్పింది. దీంతో జాన్సన్ తన స్నేహితులైన చాకలి రాజు, నవీన్, మరో 17ఏళ్ల బాలుడిని సంప్రదించాడు. అందులో భాగంగా పల్లె రవికి డబ్బులు అప్పుగా ఇస్తామని నమ్మించి ఈ నెల 24న చిన్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన జాన్సన్, చాకలి రాజు, తాండూర్‌కు చెందిన నవీన్‌న్‌తోపాటు మరో మైనర్ ఎల్లారెడ్డి మండలం పెద్దారెడ్డి గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డుకు తీసుకెళ్లి మద్యం సేవించారు. అదే సమయంలో జాన్సన్‌తోపాటు చాకలి రాజు సుత్తితో రవి తలపై దాడి చేశారు. దీంతో రవి వారి నుంచి తప్పించుకొని సమీపంలోని ఫామ్‌హౌస్‌లోకి పరుగెత్తాడు. అయినా జాన్సన్, చాకలి రాజు వెంబడించి రవిపై మరోసారి దాడి చేసినా రవి మళ్లీ తప్పించుకొని ప్రాణాలను కాపాడుకున్నాడు. కాగా, పల్లె సంపూర్ణ తన భర్తపై జాన్సన్, చాకలి రాజుతోపాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్సై భార్గవ్‌గౌడ్ దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. సంపూర్ణనే భర్తను హత్య చేయించేందుకు కుట్ర పన్నిందని తెలుసుకున్న పోలీసులు దాడి కేసును హత్యాయత్నంగా మార్చి విచారణ చేపట్టారు. నిందితులు పల్లె సంపూర్ణతోపాటు జాన్సన్, చాకలి రాజు, నవీన్, ఓ మైనర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలతోపాటు మూడు మొబైల్ ఫోన్లు, సుత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. కేసును ఛేదించిన ఎస్సైతోపాటు హెడ్ కానిస్టేబుల్ మనోహర్ రావు, కానిస్టేబుళ్లు గంగారాం, సందీప్, అన్వర్‌ని ఎస్పీ రాజేశ్‌చంద్ర ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖలో వేధింపులు!

- ఏఈఈ మృతికి అధికారి వేధింపులే కారణమని అసోసియేషన్ ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



సీఈ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఏఈఈల అసోసియేషన్ సభ్యులు

మోర్తాడ్(బాల్కొండ): నీటి పారుదల శాఖలో కిందిస్థాయి ఉద్యోగులపై ఉన్నతాధికారి ఒకరు వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఏఈఈల అసోసియేషన్ చీఫ్ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఒకరిద్దరు అధికారులు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కిందిస్థాయి ఉద్యోగులను వేధిస్తూ పబ్బం గడుపుతున్నారనే ఆరోపణలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలోనే కమ్మర్‌పల్లి ఏఈఈగా పని చేస్తున్న నితిన్ మానసిక ఒత్తిడికి గురై ఐదు రోజుల కింద మరణించాడు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి నితిన్‌పై ఒత్తిడి పెంచిన అధికారి అనేకమార్లు మానసికంగా బాధపెట్టారని ఏఈఈల అసోసియేషన్ ఆరోపించింది. పెళ్లి చేసుకొని నెల రోజులు గడువక ముందే నితిన్ విధి నిర్వహణలో మరణించడం అతని కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. పెళ్లికి అవసరమైన సెలవులు ఇవ్వకుండా గైర్హాజరైనట్లు ఉన్నతాధికారి ఒకరు రికార్డులలో చూపారనే విమర్శలున్నాయి. పండుగలకు సెలవులు ఇవ్వకుండా జీతాన్ని నిలిపివేస్తామని బెదిరించడంతోనే నితిన్ వేదనకు గురై మరణించాడని అసోసియేషన్ వివరించింది. నితిన్ మరణంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

ఉన్నతాధికారులకు నివేదించాం

నితిన్ మరణంపై వచ్చిన ఆరోపణల విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. చీఫ్ ఇంజినీర్ గురువారం నిజామాబాద్‌కు రానున్నారు. ఆయన విచారణ జరిపిన తర్వాత చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

– యశస్వి, ఎస్ఈ, ఆర్మూర్ డివిజన్